క్లుప్తంగా

'స్పందన'కు 7 అర్జీలు



జెడ్సీకి అర్జీ సమర్పిస్తున్న స్థానికులు

భీమునిపట్నం: జోన్ – 1 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనకు 7 అర్జీలు వచ్చినట్లు జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము తెలిపారు. పట్టణ ప్రణాళిక విభాగానికి 4, ఇంజినీరింగ్ విభాగానికి 1, రెవెన్యూ విభాగానికి 2 అర్జీలు వచ్చాయని, తదుపరి చర్యలకు సంబంధిత అధికారులకు పంపిస్తామని తెలిపారు.

గీతంలో జాతీయ భద్రతా దినోత్సవం



మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న దృశ్యం

కొమ్మాది: పని చేసే ప్రదేశాల్లో భద్రతను పెంపొందించుకోవడానికి గీతంలో సోమవారం భద్రతా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఉద్యోగులు తమ జీవన విధానంలో భద్రత, ఆరోగ్య రక్షణ విషయాలపై అవగాహన పెంచుకునేందుకు జాతీయ భద్రతా వారోత్సవాలు ఉపయోగపడతాయన్నారు. బహుళ అంతస్తులు, టెక్నాలజీ విభాగాలు, విద్యుత్ సర్క్యూట్ విషయంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్త వహించాలని, అదే విధంగా ప్రమాదాలు సంభవించినప్పుడు ఎలా ఎదుర్కోవాలి అనే విషయంపై మాక్ డ్రిల్ నిర్వహించారు. కార్యక్రమంలో గౌతమ్ రావు, గీతం సెక్యూరిటీ డైరెక్టర్ రమణ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇస్కాన్‌లో పౌర్ణమి పూజలు నేడు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్‌లో పౌర్ణమి సందర్భంగా మంగళవారం వైభవంగా పూజలు నిర్వహించనున్నట్లు ఇస్కాన్ అధ్యక్షుడు సాంబదాస్ ప్రభుజీ తెలిపారు. ఈ సందర్భంగా భజన సంకీర్తన, మాతాజీ ప్రవచనాలు, పుష్పాలతో అభిషేకం నిర్వహించనున్నామని తెలిపారు.

బంగారమ్మ ఉత్సవాలు ప్రారంభం

పద్మనాభం: మండలంలోని తునివలసలో మూడు రోజులు జరగనున్న బంగారమ్మ ఉత్సవాలు సోమవారం తొలేళ్లతో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా బంగారమ్మ, పరదేశమ్మ రథాలను గ్రామంలో ఊరేగించారు. మంగళవారం అమ్మవారి ప్రతిమలను ఊరేగిస్తారు. బుధవారం ముగింపు ఉత్సవం నిర్వహిస్తారు.

బీజేపీ ఎన్నికల ప్రచారం

తగరపువలస: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా బీజేపీ బలపరచిన అభ్యర్థి పీవీఎన్ మాధవ్ తరఫున ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు సోమవారం ఆదర్శనగర్‌లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా 1, 2 వార్డుల అధ్యక్షురాలు శీరపు రామలక్ష్మి మాట్లాడుతూ 2017లో ఎమ్మెల్సీగా ఎన్నికైన మాధవ్ కేంద్ర ప్రభుత్వం సమన్వయంతో పలు సమస్యల పరిష్కారానికి కృషి చేశారన్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో పంపాన సుబ్రహ్మణ్యం, పెదగాడ విజయ, చిల్ల త్రినాథరెడ్డి, కురుమెళ్ల వెంకటేశ్వరరావు, శీరపు వెంకటరెడ్డి, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

మూల్యాంకన కేంద్రం పరిశీలన

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రశ్నాపత్రాల మూల్యాంకన కేంద్రాన్ని ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత సోమవారం ఉదయం సందర్శించారు. బీఈడీ మూడో సెమిస్టర్ ప్రశ్నపత్రాల మూల్యాంకనం జరుగుతున్న విధానాన్ని ఆమె ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో విద్యా విభాగాధిపతి ఆచార్య టి.షారోన్‌రాజు, అధికారులు పాల్గొన్నారు.

కొత్తరోడ్డుతో ప్రమాదాలకు చెక్



నాడు : కల్వర్టు వద్ద రక్షణ గోడ లేకుండా గోతులమయమైన రోడ్డు



నేడు : కొత్తగా నిర్మించిన రోడ్డు... పక్కనే కల్వర్టు వద్ద నిర్మిస్తున్న రక్షణ గోడ

- సుందరంగా ముస్తాబైన భీమిలి – విశాఖ రహదారి
- చురుగ్గా కల్వర్టు రక్షణ గోడ నిర్మాణ పనులు

భీమునిపట్నం: భీమిలి తీరాన్ని ఆనుకుని కొద్దిరోజుల కిందటి వరకూ గతుకులమయమై ప్రమాదకరంగా మారిన రోడ్డు నిర్మాణ పనులు పూర్తి కావడంతో ఈ మార్గంలో ప్రమాదాలకు తెరపడుతుందని స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. భీమిలి నుంచి విశాఖకు వెళ్లే మార్గంలో శ్మశాన వాటిక సమీపంలో రోడ్డు బాగా కిందకు వాలుగా ఉంటుంది. దీనికితోడు పూర్తిగా గతుకులమయమై పాడైపోయింది. మరోవైపు రోడ్డు రెండు వైపులా వాలుగా ఉంటుంది. ఈ క్రమంలో భీమిలి, విశాఖ నుంచి రాకపోకలు సాగించే వాహనాలు చాలా వేగంగా కిందకు దూసుకొస్తాయి. అలా వచ్చిన చోట రోడ్డు గతుకులమయమై ఉండడంతో అనేక సందర్భాల్లో వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలకు గురయ్యేవి. పలువురు గాయపడ్డారు కూడా. ఇదే ప్రాంతంలో రోడ్డు కింద గెడ్డ ఉండగా దానికి రక్షణ గోడ లేదు.

దీంతో భారీ వర్షాలు కురిసే సమయాల్లో నీరు పెద్ద ఎత్తున రోడ్డుపైకి రావడంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉంటోంది. పరిస్థితి చాలా రోజుల నుంచి ఇబ్బందిగా ఉండడంతో అధికారులు ఇటీవల స్పందించి కొత్త రోడ్డు నిర్మాణం పూర్తి చేయించారు. రక్షణ గోడ నిర్మాణ పనులు కూడా చురుగ్గా జరుగుతున్నాయి. ప్రస్తుతం వాహనాలు ఎంతో సదుపాయంగా రాకపోకలు సాగిస్తున్నాయి. రోడ్డు, కల్వర్టు సమస్య పరిష్కారం కావడంతో వాహనదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థులకు ఏకాగ్రత అవసరం



మాట్లాడుతున్న ఇస్రో శాస్త్రవేత్త రామచంద్రరావు

పద్మనాభం: విద్యార్థులు ఏకాగ్రత, విశ్వాసం, నిబద్ధతతో ముందుకు సాగితే జీవితంలో విజయం సాధిస్తారని ఇస్రో శాస్త్రవేత్త ఎస్.రామచంద్రరావు అన్నారు. పద్మనాభంలోని కస్తూర్బా విద్యాలయాన్ని సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకుంటే విజయం సాధించగలరన్నారు. కష్టపడి చదివినప్పుడే విజయానికి చేరువవుతారన్నారు. ఉపాధ్యాయులు బోధించే సమయంలో ప్రస్తుత సంఘటనలను ఉదహరించాలన్నారు. ఉపగ్రహ ప్రయోగం, పనితీరుపై విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో సమగ్ర శిక్షా ఏపీసీ శ్రీనివాసరావు, జీసీడీవో కాలేషా బేగం, స్పెషలాఫీసర్ గ్రేస్ లిల్లీ పాల్గొన్నారు.

ముగిసిన కబడ్డీ పోటీలు



పతకాలతో క్రీడాకారులు, నిర్వాహకులు

ఆనందపురం : మండలంలోని గుడిలోవ విజ్ఞాన విహార్ ఆవాస విద్యాలయం ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నిర్వహించిన మూడు మండలాల స్థాయి కబడ్డీ పోటీల్లో మండలంలోని వేములవలస జట్టు విజేతగా నిలిచింది. ఈ పోటీలను జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు ప్రారంభించగా 14 జట్లు పాల్గొన్నాయి. అందులో ద్వితీయ స్థానాన్ని గిడిజాల జట్టు దక్కించుకుంది. ఈ మేరకు విజేతలకు నిర్వాహకులు బహుమతులు, పతకాలు అందజేశారు. క్రీడలు మానసిక, శారీరక ఉల్లాసానికి దోహదం చేస్తాయని, పోటీలు స్నేహపూర్వకంగా సాగాలని కోరాడ వెంకటరావు సూచించారు.

వ్యక్తిగత పరిశుభ్రతతోనే వ్యాధులు దూరం



విద్యార్థినికి దంత పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యురాలు

ఆనందపురం : అందరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే వ్యాధుల బారి నుంచి రక్షించుకోవచ్చని యంగ్ ఇండియా చాప్టర్ రూరల్ చైర్‌పర్సన్ దివ్య జమ్ముల సూచించారు. మండలంలోని నేతేరులో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో సోమవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్య మాట్లాడుతూ గ్రామీణ బాలికల ఆరోగ్య సంరక్షణకు తమ సంస్థ నిరంతరం కృషి చేస్తోందని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు నోటి, వ్యక్తిగత, బహిష్టు, పరిశుభ్రత, లైంగిక వేధింపులపై అవగాహన కలిగించారు. గైనకాలజిస్టులు, డెర్మటాలజిస్టులు, దంత వైద్యులు పాల్గొని 150 మందికి వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో విద్యాలయం ప్రత్యేకాధికారి చంద్రకళ, చాప్టర్ కో – చైర్‌పర్సన్ కె.అగర్వాల్, జగపతిరాయ్, హర్షనందన్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మహాలక్ష్మి జయంతి ఉత్సవాలు

కొమ్మాది: స్థానిక అన్నంరాజునగర్‌లో గల శ్రీ అష్టలక్ష్మి ఆలయంలో మంగళవారం, బుధవారం శ్రీ మహాలక్ష్మి జయంతి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ప్రధాన అర్చకులు చామర్తి శ్రీధర స్వామి ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం పాల్గుణ పౌర్ణమి సందర్భంగా తెల్లవారుజామున 4 గంటల నుంచి శ్రీ అష్టలక్ష్మి హోమం, ఉదయం 8 గంటలకు శ్రీ లక్ష్మీ నారాయణులకు విశేష పంచామృతాభిషేకం, సాయంత్రం సామూహిక కుంకుమార్చన, సహస్ర దీపాలంకరణ సేవ, సువర్ణ పుష్పార్చన నిర్వహించనున్నారు. బుధవారం ఉత్తర నక్షత్రం సందర్భంగా విశేష అర్చనలు, ఆరాధన, పారాయణం, పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

సచివాలయ రహదారిపై భవన నిర్మాణ మెటీరియల్



బాలాజీనగర్ వార్డు సచివాలయం రహదారిపై వేసిన భవన నిర్మాణ మెటీరియల్

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు బాలాజీనగర్ వార్డు సచివాలయ మార్గంలో సీసీ రోడ్డుపై భవన నిర్మాణ మెటీరియల్ వ్యర్థాలు ఉండడంతో ద్విచక్ర వాహనదారులు జారిపడుతున్నారు. నడక ద్వారా రాకపోకలు సాగించేవారు ఎత్తుపల్లాలతో కూడిన ఈ మార్గంలో జారిపోతున్నారు. రోజూ విధుల నిర్వహణకు సచివాలయ సిబ్బంది, వలంటీర్లతోపాటు వివిధ అవసరాల నిమిత్తం సచివాలయానికి బాలాజీనగర్, రామన్నపేట, గాంధీబొమ్మ, వెంకటేశ్వరమెట్ట ప్రజలు వస్తున్నారు. అందువల్ల ఈ రహదారిలో భవన నిర్మాణ వ్యర్థాలు తొలగించి సీసీరోడ్డుకు మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

పెచ్చులూడుతున్న భగీరథ రిజర్వాయర్



వెంకటేశ్వరమెట్టపై భగీరథ రిజర్వాయర్‌కు పెచ్చులూడుతున్న దృశ్యం

తగరపువలస: భీమిలి జోన్ ప్రజలకు తాగునీరు అందించే కృత్రిమ రిజర్వాయర్లలో ఒకటైన భగీరథ పథకానికి పెచ్చులూడుతున్నాయి. జాతీయ రహదారిని ఆనుకుని వెంకటేశ్వర మెట్టపై ఉన్న ఈ రిజర్వాయర్‌కు అనుసంధానంగా నిర్వాహకుల కోసం ఒక గదిని నిర్మించారు. రిజర్వాయర్ నుంచి గదిలోకి వెళ్లేందుకు వేసిన శ్లాబ్ ప్రస్తుతం ఊడిపోయి ఇనుప ఊచలు బయటకు వచ్చాయి. దీని బీమ్‌కు కూడా పగుళ్లు కనిపిస్తున్నాయి. అంతేకాకుండా రిజర్వాయర్ చుట్టూ కూడా గోడ నుంచి పెచ్చులు ఊడుతున్నాయి. ప్రారంభంలోనే వీటికి మరమ్మతులు చేపట్టాలని, శిథిలాలు పెద్దవి కాకుండా చూడాలని ఈ మెట్టపై ఆలయానికి వచ్చే భక్తులు కోరుతున్నారు. అంతేకాకుండా రిజర్వాయర్‌ను ఆనుకుని ఉన్న మర్రిచెట్టు కింద నిత్యం వందలాది మంది ఎండ నుంచి ఉపశమనం పొందడానికి సేదతీరుతుంటారు. రిజర్వాయర్ నిర్మాణం పెచ్చులు ఊడకుండా జీవీఎంసీ మరమ్మతులు చేపట్టాలని వారంతా కోరుతున్నారు.

ప్రైవేటు భూమిలో బడ్డీలు తొలగించాలి

మధురవాడ: కొందరు వ్యక్తులు ప్రైవేటు భూముల్లో కూడా రోడ్డును ఆనుకుని బడ్డీలు ఏర్పాటు చేసేస్తున్నారని మల్లయ్యపాలెంకి చెందిన కొల్లి విజయభాస్కర్ వాపోయారు. మధురవాడ ఐటీ సెజ్ కూడలి మానం ఆంజనేయులు నగర్ పక్కన ఉన్న శ్రీనివాసనగర్‌లో తన భూమిలో రోడ్డును ఆనుకుని పీవీ ప్రసాద్ అనే వ్యక్తి జీవీఎంసీ పేరు చెప్పి బడ్డీ ఏర్పాటు చేశాడని ఆరోపించారు. అలాగే తన భూమితోపాటు పక్కనే ఉన్న పార్కు స్థలంలో అనధికార నిర్మాణానికి ప్రయత్నం చేస్తున్నాడని, తక్షణమే చర్యలు చేపట్టాలని జోనల్ కమిషనర్ కొట్యాడ కనక మహాలక్ష్మికి స్పందనలో సోమవారం ఫిర్యాదు చేశాడు. మధురవాడ జోన్ – 2 కార్యాలయంలో నిర్వహించిన స్పందనకు 5 అర్జీలు వచ్చాయి. సమస్యల పరిష్కారానికి తక్షణమే చర్యలు చేపడతామని జెడ్సీ హామీ ఇచ్చారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 108 మందికి కొలువులు

ఆనందపురం : మండలంలోని గిడిజాలలో ఉన్న సాయిగణపతి పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 108 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ ఉమామహేశ్వరరావు తెలిపారు. చెన్నైలోని సియట్ టైర్ల కంపెనీ శని, ఆదివారాల్లో డిప్లమో, మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ విభాగాలకు చెందిన ఆఖరి సంవత్సరం విద్యార్థులకు వివిధ రకాల పరీక్షలు నిర్వహించి 108 మందిని ట్రైనీ ఇంజినీర్లుగా ఎంపికచేశారు. వారికి సోమవారం నియామకపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం

భీమునిపట్నం: ఒక యువకుడి అదృశ్యంపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. గొల్లలతాళ్లవలసకు చెందిన చిన్ని దినేష్(22) మధురవాడలోని ఒక ఫైనాన్స్ కంపెనీలో పని చేస్తున్నాడు. ఎప్పటిలాగే 3వ తేదీన ఉదయం ఆరు గంటలకు తాను ఆఫీసుకు వెళ్తున్నట్లు తల్లిదండ్రులకు చెప్పి వెళ్లిపోయాడు. ఒక గంట తర్వాత ఇంటికి ఫోన్ చేసి ఆఫీసు పని మీద అత్యవసరంగా కోల్‌కతా వెళ్తున్నట్టు చెప్పాడు. అదే రోజు పది గంటల తర్వాత అతని ఆఫీసు నుంచి ఇద్దరు వచ్చి దినేష్ కార్యాలయానికి రాలేదని... ఫైనాన్స్ పుస్తకాలు అతని వద్ద ఉన్నాయని, అవి తీసుకెళ్లడానికి వచ్చినట్టు తెలిపారు. దీంతో అతని తండ్రి చిన్ని సూరిబాబుకు అనుమానం వచ్చి మధురవాడలోని కార్యాలయానికి వెళ్లి విచారించగా అక్కడకు రాలేదని తెలిసింది. అనంతరం తెలిసిన వారి వద్ద విచారించగా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సుధాకర్ గెలుపుతో ఉత్తరాంధ్ర అభివృద్ధి

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



సీతంరాజు సుధాకర్‌కు ఓటు వేయాలని వెల్లంకిలో ఉపాధ్యాయులను అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ఆనందపురం : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ బలపరిచిన సీతంరాజు సుధాకర్ గెలుపు ఉత్తరాంధ్ర అభివృద్ధికి నాంది కావాలని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మండలంలోని వెల్లంకి, శొంఠ్యాం, గిడిజాల గ్రామాల్లో ఆయన సోమవారం పర్యటించి ఉపాధ్యాయులు, పట్టభద్రులను కలిసి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన అనంతరం సుమారు లక్షన్నర సచివాలయాల ఉద్యోగాలు, వలంటీర్లతోపాటు ప్రభుత్వ సంస్థల్లో వేలాది ఉద్యోగాలను భర్తీ చేశారని చెప్పారు. పదవీ విరమణ వయస్సు రెండేళ్లు పెంచడంతో లక్షలాది మంది ఉద్యోగులకు లబ్ధి చేకూరిందని వివరించారు. అలాగే వెనుకబడిన ఉత్తరాంధ్రను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి కంకణం కట్టుకున్నారని, అందుకే విశాఖను పరిపాలనా రాజధాని చేయడానికి కృతనిశ్చయంతో ఉన్నారన్నారు. అందుకు ఉదాహరణే భోగాపురంలో అంతర్జాతీయ ఎయిర్‌పోర్టు నిర్మాణం, బీచ్ కారిడార్‌లో విశాఖ పోర్టు నుంచి భోగాపురం ఎయిర్‌పోర్టు వరకూ ఆరు లైన్ల రహదారి నిర్మాణం అని చెప్పారు. ముఖ్యంగా విశాఖపై అంతర్జాతీయ సంస్థలు సైతం మక్కువ చూపించి రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టడానికి సంసిద్ధత వ్యక్తం చేశాయంటే జగన్ మోహన్ రెడ్డి పాలనపై ఎంత విశ్వాసం ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. ఈ దృష్ట్యా విశాఖను పరిపాలనా రాజధానికి అందరమూ ఆమోదం తెలుపుతున్నట్టు ఎమ్మెల్సీ ఎన్నికల్లో సీతంరాజు సుధాకర్‌ని గెలిపించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి కానుకగా అందజేయాలన్నారు. ఈ సందర్భంగా నమూనా బ్యాలెట్లు పంపిణీ చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, పార్టీ మండల అధ్యక్షుడు కోరాడ వెంకటరావు, నాయకులు కాకర్లపూడి వరహాలరాజు, కాకర్లపూడి శ్రీకాంత్‌రాజు, బంటుబిల్లి మణిశంకరనాయుడు, బోని అప్పలనాయుడు, పాండ్రింకి శ్రీను, బొట్టా రామకృష్ణ, కాకర వెంకట రమణ, పిన్నింటి వెంకటరమణ, ఉప్పాడ లక్ష్మణరావు, షిణగం అప్పలరాజు, లెంక రాంబాబు, కోరాడ వెంకటరమణా రావు, పల్లా రమణ, గండ్రెడ్డి శ్రీనివాసరావు, పడాల రాము, కోరాడ ముసిలినాయుడు పాల్గొన్నారు.

భీమునిపట్నం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మద్దతుతో పోటీ చేస్తున్న సీతంరాజు సుధాకర్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని వైఎస్సార్‌సీపీ 3వ వార్డు అధ్యక్షుడు అల్లిపిల్లి నర్సింగరావు కోరారు. ఎగువపేటలో వాడవాడలా తిరుగుతూ సోమవారం ప్రచారం నిర్వహించారు. నూకాలమ్మ వారి ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ వాసుపల్లి కొండబాబు, మాజీ కౌన్సిలర్ మైలపల్లి లక్ష్మణరావు, కుంటుభుక్త ముత్యాలరావు, వాసుపల్లి ఎల్లాజీ తదితరులు పాల్గొన్నారు.



3వ వార్డులో సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కొమ్మాది: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రచారం జోరుగా సాగుతోంది. వైఎస్సార్ సీపీ మద్దతు అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని 5వ వార్డు మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతరావు అభ్యర్థించారు. సోమవారం బోరవానిపాలెం, అంబేడ్కర్‌కాలనీ, మారికవలసలో ఆయన ప్రచారం నిర్వహించారు. జేఎస్ రెడ్డి, ముచ్చు రామారావు, బోర శ్రీను, సూరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మధురవాడ: వైఎస్సార్‌సీపీ బలపరచిన సీతంరాజు సుధాకర్ గెలుపు చాలా కీలకమని ఆ పార్టీ నాయకులు ప్రచారం చేశారు. జీవీఎంసీ 7వ వార్డు వాంబేకాలనీ, పరిసర ప్రాంతాల్లో వార్డు అధ్యక్షుడు పోతిన శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సోమవారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి కరపత్రాలు పంచి మొదటి ప్రాధాన్యత ఓటు సుధాకర్‌కు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యుడు పీకేఎమ్ పాత్రుడు, శ్రీనివాస్, మంగమ్మ, ప్రభ, ఉమా మహేశ్వరి, కొండమ్మ, రాంబాబు, రమణ, సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.



ప్రచారంలో వైఎస్సార్ సీపీ నాయకులు

మాజీ ఎంపీపీ మహేశ్వరరావు మృతి



పద్మనాభం: పద్మనాభం మండల మాజీ ఎంపీపీ అలమండ మహేశ్వరరావు సోమవారం మృతి చెందారు. అతను 1987 నుంచి 1992 వరకు ఎంపీపీగా పని చేశారు. కొంత కాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నారు. దీంతో ఇటీవల విశాఖపట్నంలోని ఓ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. స్వగ్రామం పెంటలో మహేశ్వరరావు అంత్యక్రియలు నిర్వహించారు.

ఆకట్టుకున్న రామాంజనేయ యుద్ధం నాటకం



నాటక ప్రదర్శనలో పాల్గొన్న కళాకారులు

తగరపువలస: సంగివలస పోలమాంబ అమ్మవారి వార్షిక ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి ఆలయ ఆవరణలో రామాంజనేయ యుద్ధం పౌరాణిక నాటకం ప్రదర్శించారు. రామునిగా తాతారావు, ఆంజనేయునిగా నారాయణరావు తమ వాగ్ధాటితో యుద్ధ సీన్‌ను రక్తి కట్టించారు. పద్యాల ద్వారా ఆహూతులను ఆకట్టుకున్నారు. వీరికి వాసు, లక్ష్మణ సంగీత సహకారం అందించారు.

వైభవంగా అనంతుని రథోత్సవం



సుందరంగా అలంకరించిన అనంతుని రథం



రథంపై ఉత్సవ విగ్రహాలు



విద్యుద్దీపాలంకరణలో ఆలయం

పద్మనాభం: పద్మనాభంలో అనంతుని కల్యాణోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి అనంత పద్మనాభ స్వామి రథోత్సవం కన్నుల పండువగా జరిగింది. ముందుగా విశేష హోమం, గ్రామ బలిహరణం వంటి పూజాది కార్యక్రమాలు నిర్వహించారు.

రాత్రి 11 గంటలకు శ్రీదేవి భూదేవి సమేత అనంతుని ఉత్సవ విగ్రహాలను పల్లకీలో వేద పండితులు రథంపైకి తోడ్కొని వచ్చారు. పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ సన్యాసినాయుడు ప్రథమ పూజ అనంతరం రథోత్సవం గాలి గోపురం వద్ద రాత్రి 11.30 గంటల తర్వాత ప్రారంభమైంది. కృష్ణాపురం గ్రామానికి చెందిన మొకర, సుంకర, పద్మనాభం, అర్చకునిపాలెం గ్రామాలకు చెందిన తాలాడ, ఐనకలపాలెం గ్రామానికి చెందిన కంటుబోతు వారి కుటుంబ సభ్యులతోపాటు అశేష భక్తజనం రథాన్ని లాగగా రాజవీధి గుండా అనంతుని రథ చక్రాలు ముందుకు సాగాయి. కార్యక్రమంలో ఈవో ఎస్. నానాజీబాబు, ఎంపీపీ కంటుబోతు రాంబాబు, మొకర అప్పలనాయుడు, తాలాడ పద్మనాభం, కంటుబోతు ఎర్నాయుడు పాల్గొన్నారు.